చలివేంద్రాలు విస్తృతంగా ఏర్పాటు చేయాలి



మల్కాజిగిరి చౌరస్తాలో చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి: వేసవిని దృష్టిలో ఉంచుకుని విస్తృతంగా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి పార్టీ శ్రేణులకు సూచించారు. మాజీ కార్పొరేటర్లు జగదీష్‌గౌడ్, మురుగేష్‌లు మల్కాజిగిరి, సఫిల్‌గూడ, ఈస్ట్ ఆనంద్‌బాగ్‌లో చలివేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చలివేంద్రాలు విస్తృతంగా ఏర్పాటు చేయాలని, తాగునీటి సరఫరా జలమండలి ద్వారా పంపిణీ జరిగేలా చూస్తామన్నారు.

సన్నబియ్యం పంపిణీ



బియ్యం పంపిణీ చేస్తున్న కార్పొరేటర్

రామంతాపూర్: ఆర్టీసీ కాలనీలోని రేషన్‌షాపులో బుధవారం కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సన్న బియ్యం పంపిణీలో రాష్ట్ర ప్రభుత్వంతో సమానంగా కేంద్ర ప్రభుత్వం వాటా కూడా ఉందని అభిప్రాయపడ్డారు. అనంతరం ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

మాజీ కార్పొరేటర్‌పై కేసు

మల్కాజిగిరి: అనుమతి లేకుండా డ్రోన్ కెమెరా, డీజే ఉపయోగించిన మాజీ కార్పొరేటర్‌పై మల్కాజిగిరి పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. ఈస్ట్ ఆనంద్‌బాగ్‌లో మాజీ కార్పొరేటర్ మురుగేష్ చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రోడ్డుపై డీజే ఏర్పాటు చేసి ట్రాఫిక్‌కు ఇబ్బందులు కల్గించడమే కాకుండా డ్రోన్ కెమెరా ఉపయోగించారని ఆదర్శనగర్‌కు చెందిన శ్రీనివాసరావు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాదక ద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన

కుషాయిగూడ: యాంటీ డ్రగ్ సోల్జర్స్, తెలంగాణ యాంటీ నార్కొటిక్స్ సంయుక్తంగా ఈసీఐఎల్‌లోని ఎస్ఆర్ డీజీ పాఠశాలలో విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలను వారికి వివరించారు. ముఖ్యంగా యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి ఆరోగ్యంగా జీవించాలని సూచించారు. ఎస్సై హనుమాన్‌నాయక్, రాజు, మోహన్‌పాటిల్, ముక్కంటి, శ్రీశైలం తదితరులున్నారు.

చర్లపల్లి జైల్‌ను సందర్శించిన ట్రైనీ ఐఏఎస్‌లు !



చర్లపల్లి జైలులో ట్రైనీ ఐఏఎస్ అధికారులతో జైళ్లశాఖ డీజీపీ డాక్టర్ సౌమ్యమిశ్రా

కుషాయిగూడ: ప్రాక్టికల్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లో భాగంగా బుధవారం ట్రైనీ ఐఏఎస్ అధికారులు చర్లపల్లి కేంద్ర కారాగారాన్ని సందర్శించారు. జైళ్లశాఖ డీజీపీ డాక్టర్ సౌమ్యమిశ్రా, డీఐజీ డాక్టర్ శ్రీనివాస్‌ల నేతృత్వంలో వారు జైల్ సందర్శనకు వచ్చారు. ఈ సందర్భంగా వారికి జైలు పనితీరు, ఖైదీల వసతులు, సంక్షేమం వంటి అంశాలపై ఆమె అవగాహన కల్పించారు. ఖైదీల సంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. తమ కెరియర్‌లో ఈ సందర్శన ఎంతగానో దోహదపడుతుందని, ట్రైనీ ఐఏఎస్ అధికారులు వ్యక్తం చేసినట్లు జైల్ అధికారులు తెలిపారు. ఉప పర్యవేక్షణాధికారులు కాళిదాస్, శశికాంత్, రత్నం తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాలుడి మృతి



రాజేష్ (ఫైల్)

కుషాయిగూడ: గత సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాలుడు రాజేష్ (6) నిమ్స్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. బస్సును ఓవర్‌టేక్ చేయబోయి అదుపుతప్పిన ఇన్నోవా వాహనం ఎదురుగా వచ్చిన బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో పుల్లారావు అక్కడికక్కడే మృతిచెందగా.. భార్య నాగరాజ్, కుమారులు రుత్విక్, రాజేష్‌లు గాయపడిన విషయం తెలిసిందే. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాజేష్ మృతిచెందినట్లు పోలీసులు ప్రకటించారు. మిగిలిన ఇద్దరి పరిస్థితి కూడా విషమంగానే ఉన్నట్లు సమాచారం.

బహుజన పక్షపాతి సర్వాయి పాపన్న

ఘనంగా నివాళులర్పించిన వివిధ పార్టీల నేతలు



హెచ్‌బీకాలనీలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ ప్రభుదాస్

కుషాయిగూడ: బహుజన పక్షపాతి సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతిని హెచ్‌బీకాలనీలో ఘనంగా నిర్వహించారు. బుధవారం జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ డివిజన్ పార్టీ అధ్యక్షుడు మునుగంటి రాంప్రదీప్, బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ హాజరై పాపన్న విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బహుజనుల అభ్యున్నతికి ఆయన చేసిన పోరాటాన్ని స్మరించుకున్నారు. కౌండిన్య సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఓల్డ్ మల్లాపూర్ కౌండిన్యభవన్ వద్ద..

మల్లాపూర్: బహుజనుల మార్గదర్శి సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ఆశయాలను కొనసాగించాలని మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 315వ వర్ధంతిని ఓల్డ్ మల్లాపూర్‌లో ఘనంగా నిర్వహించారు. అనంతరం కౌండిన్యభవన్ వద్ద సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మల్లాపూర్ మీర్‌పేట్ గౌడ సంఘం ప్రతినిధులు దంతూరి రాజుగౌడ్, తీగుళ్ల శ్రీనివాస్‌గౌడ్, రంగు ప్రసాద్‌గౌడ్, మెరుపుల బాలరాజ్‌గౌడ్, అశోక్‌గౌడ్, సతీష్‌గౌడ్, బాలరాజ్‌గౌడ్, సాయి, సాయికుమార్, సుదర్శన్ తదితరులున్నారు.

ఓల్డ్ అల్వాల్‌లో..

అల్వాల్: అల్వాల్‌లో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మచ్చబొల్లారం కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్ హాజరై పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బహుజన రాజ్యాన్ని స్థాపించిన తొలి పోరాటయోధుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. లక్ష్మీకాంత్‌రెడ్డి, కాంగ్రెస్ ఏ–బ్లాక్ అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, కో–కన్వీనర్ సీఎల్.యాదగిరి, నాగేశ్వర్‌రావు, సాయిరాంగౌడ్, సురేందర్‌రెడ్డి, ఉదయ్, సంతోష్‌రెడ్డి, శ్రీశైలంయాదవ్, వీనస్‌మేరీ, శశికళ, నిర్మల, సత్తయ్యగౌడ్, ఆంజనేయులుగౌడ్, వేణుగోపాల్‌గౌడ్, శరత్‌గౌడ్, మల్లేష్‌గౌడ్, కృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



హెచ్‌బీకాలనీలో మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్



పాపన్నగౌడ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి



ఓల్డ్ అల్వాల్‌లో కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్, కాంగ్రెస్ నేతలు

రూ.6.2 కోట్లతో అభివృద్ధి పనులు



బాక్స్‌డ్రైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ మీన

అల్వాల్: నేరేడ్‌మెట్ డివిజన్ ఎంప్లాయిస్ కాలనీ నుంచి సాయికృష్ణ ఎన్‌క్లేవ్ వరకు రూ.6.2 కోట్లతో నిర్మించే బాక్స్‌డ్రైన్ పనులను ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ కొత్తపల్లి మీనాఉపేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా బుధవారం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మల్కాజిగిరి నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. ప్రతి కాలనీలో అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. నాయకులు కొత్తపల్లి ఉపేందర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, ఆదిత్య, పరమేష్‌శర్మ, సత్యనారాయణ, రాజిరెడ్డి, పర్వతాలు, శ్యామ్, సాయి, పవన్, నవీన్‌గౌడ్, అల్బర్ట్, పంకజం, సుదర్శిని, శాలిని, అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

బాలికపై లైంగికదాడికి పాల్పడిన నిందితుడికి జైలు



రాకూర్ సంజయ్

అల్వాల్: బాలికపై లైంగికదాడికి పాల్పడిన నిందితుడికి మేడ్చల్, మల్కాజిగిరి న్యాయస్థానం మూడేళ్ల జైలుశిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధించింది. నేరేడ్‌మెట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 2017 డిసెంబర్ 11న బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఓల్డ్ సఫిల్‌గూడకు చెందిన ఠాకూర్ సంజయ్ (21)పై పోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి కోర్టుకు పోలీసులు సాక్ష్యాలు సమర్పించగా.. మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా న్యాయస్థానం బుధవారం తీర్పు వెలువరించింది.

ఇంటి అనుమతి రద్దు చేయాలి

మల్కాజిగిరి: జీహెచ్ఎంసీ అధికారులు మంజూరు చేసిన ఇంటి అనుమతిని రద్దు చేయాలని, శక్తినగర్‌కు చెందిన మహర్షి అనే వ్యక్తి జీహెచ్ఎంసీ అధికారులను కోరారు. బుధవారం జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ.. 1984లో 200 గజాల స్థలం శక్తినగర్‌లో కొనుగోలు చేశామన్నారు. తప్పుడు పత్రాలతో కొంతమంది జీహెచ్ఎంసీ ద్వారా అనుమతి పొంది నిర్మాణం చేస్తున్నారన్నారు. జోనల్ కార్యాలయం, సర్కిల్ కార్యాలయంలో ఫిర్యాదు చేశామని తమకు న్యాయం చేయాలని కోరారు.

హెచ్‌సీయూ భూముల వేలాన్ని నిలిపేయాలి



గౌతంనగర్: హెచ్‌సీయూలో 400 ఎకరాల భూములను రాష్ట్ర ప్రభుత్వం వేలం వేయడాన్ని మాల మహానాడు తీవ్రంగా ఖండిస్తుందని మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు నరహరి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. భూముల వేలం అడ్డుకున్న విద్యార్థులపై పోలీసుల దౌర్జన్యం చేసి అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అరెస్ట్ చేసి విద్యార్థులను వెంటనే విడుదల చేయాలన్నారు. తక్షణమే హెచ్‌సీయూ భూముల వేలం ఆపాలని, అఖిలపక్షంతో చర్చలు జరిపి విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పుల ఆషుతోష్, బైరు అనిల్‌కుమార్, బండారి రవి, శ్రీధర్, రాంమోహన్, దత్తాత్రేయ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో జైబాపు, జై భీమ్, జై సంవిధాన్



గౌతంనగర్: డివిజన్ పరిధి ఐఎస్‌నగర్‌లో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ బీ–బ్లాక్ అధ్యక్షులు వెంకటేష్‌యాదవ్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ పాలనలో రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛ, సమానత్వం హక్కులను కాలరాస్తు, మహాత్మగాంధీ చూపిన అహింస, శాంతి సిద్ధాంతాలను విస్మరిస్తుందన్నారు. కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్, నాయకులు లక్ష్మీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్, ప్రవీణ్, రాంచందర్, నాగరాజు, సత్యనారాయణ, ఫరీద్, యూసుఫ్, కొమురయ్య, బాలరాజుయాదవ్, సంపత్‌గౌడ్, శ్రీనివాస్‌యాదవ్, ధర్మేష్‌యాదవ్, ఇస్తారి, శ్రీనివాసచారి, విజయలక్ష్మి, కనకలక్ష్మి, అగమయ్య, సిరిగిరి రాజు తదితరులున్నారు.

మహనీయుల జయంతులకు ప్రభుత్వం ఏర్పాట్లు చేయాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

అల్వాల్: మహనీయుల జయంతులను రాష్ట్ర ప్రభుత్వం తరపున ఏర్పాట్లు చేయాలని జై భీమ్ సేన, ఫైట్ ఫర్ రైట్స్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పోతరాజు శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఏప్రిల్ 5న మహనీయులు భారత మాజీ ఉపప్రధాని బీజేఆర్ జయంతి, ఏప్రిల్ 11న మహాత్మా జ్యోతిరావుపూలే జయంతి, ఏప్రిల్ 14న డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జయంతి ఉన్నందున వారి గౌరవార్థం ప్రభుత్వం తరపున అధికారికంగా నిర్వహించాలని కోరారు. సంఘం ఉపాధ్యక్షుడు గుమ్మడి బాలనర్సింహ, సెక్రటరీ జక్కుల భాగ్యమ్మ, ట్రెజరర్ మేకల రమేష్ తదితరులున్నారు.

ప్రభుత్వ పథకాలు పక్కదారి పట్టకుండా చూడాలి



కుషాయిగూడలో సన్నబియ్యం పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కుషాయిగూడ: ప్రభుత్వ పథకాను పేదలు సద్వినియోగం చేసుకుని, పక్కదారి పట్టకుండా అధికారులు చూసుకోవాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం ఆయన కుషాయిగూడలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సన్నబియ్యం పథకం అర్హులైన ప్రతి పేద కుటుంబానికి అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. నియోజకవర్గంలో నివసించే కార్మికులు, పేద ప్రజలకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. డీఎస్ఓ సుగుణబాయి, సంధ్య, శీనయ్య, స్థానిక నేతలు శ్రీనివాస్‌రెడ్డి, పద్మారెడ్డి, మహేష్‌గౌడ్, యాదయ్య, విద్యాసాగర్, చక్రపాణిగౌడ్, వినోద్, అనిల్, గంప కృష్ణ, కనకరాజుగౌడ్ తదితరులున్నారు.

శ్రీరామనవమికి ఏర్పాట్లు చేయండి



డీసీకి వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: శ్రీరామనవమి పండుగ సందర్భంగా ఏర్పాట్లు చేయాలని మల్కాజిగిరి సర్కిల్ ఉపకమిషనర్‌కు కార్పొరేటర్ శ్రవణ్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. పలుచోట్ల రోడ్లపై గుంతలు ఉన్నాయని, చెట్లకొమ్మలు తొలగించి, వెలగని విద్యుత్‌దీపాలకు మరమ్మతులు చేయించాలని కోరామన్నారు. పండుగ రోజు దేవాలయాల వద్ద ప్రత్యేక శానిటేషన్ ఏర్పాట్లు, దోమల బెడద లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశామన్నారు. ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ ఆశాలతను కలిసిన కార్పొరేటర్ పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని, ప్రతిపాదనలు సిద్ధం చేసిన వాటికి నిధులు మంజూరు చేయాలని కోరారు. సునీల్, నాగరాజు, వెంకట్ తదితరులున్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం



ప్రాణప్రతిష్ఠాపన వేడుకల్లో విగ్రహదాతలు

బోడుప్పల్: చెంగిచర్ల ద్వారకానగర్ కాలనీ ఫేస్–2లో బుధవారం అభయాంజనేయస్వామి ప్రాణప్రతిష్ఠాపనోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య హోమాలు, యజ్ఞాలు నిర్వహించారు. ఈ మహోత్సవంలో రాములవారి విగ్రహాన్ని వంగ మల్లేష్‌గౌడ్, సీతమ్మతల్లి విగ్రహాన్ని పడిగెల రవీందర్, లక్ష్మణ స్వామి విగ్రహాన్ని డాక్టర్ లక్షెట్టి శ్రీధర్, హనుమాన్ విగ్రహాన్ని ముంత జగన్, సువర్చల దేవీ విగ్రహాన్ని గుండ వినోద్ దాతలు అందజేశారు. వైభవంగా జరిగిన వేడుకల్లో కాలనీవాసులు పెద్దఎత్తున పాల్గొన్నారు. అనంతరం విగ్రహ దాతలను ఘనంగా సత్కరించారు.

త్వరలోనే శ్మశానవాటిక సుందరీకరణ పనులు



చర్లపల్లి శ్మశానవాటిక వద్ద స్థానికులతో కార్పొరేటర్ బొంతు శ్రీదేవి తదితరులు

కుషాయిగూడ: చాలా రోజులుగా పెండింగ్‌లో ఉన్న చర్లపల్లి శ్మశానవాటిక సుందరీకరణ పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. చర్లపల్లి శ్మశానవాటిక సుందరీకరణకు రూ.6 కోట్లు నిధులు మంజూరు కావడంతో బుధవారం ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఆమె సందర్శించారు. హిందూ, ముస్లిం, క్రిస్టియన్లకు ఒకే చోట నిర్మాణం చేస్తున్నట్లు వివరించారు. ఈ క్రమంలో పాత సమాధుల కూల్చివేతలు చేపట్టబోమని స్పష్టం చేశారు. బర్నింగ్ ఫ్లాట్ ఫామ్ అన్ని రకాల వసతులతో చర్లపల్లి శ్మశానవాటిక ఆధునాతన శ్మశానవాటికగా మారనుందన్నారు. ఇంజినీరింగ్ డీఈ బాలకృష్ణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాగిళ్ల బాల్‌రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్ స్థానిక నేతలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

బీఆర్ఎస్ శ్రేణులు హర్షం..

కుషాయిగూడ: చర్లపల్లి శ్మశానవాటిక సుందరీకరణకు రూ.6 కోట్ల నిధులు మంజూరు కావడంపై బీఆర్ఎస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. బుధవారం పార్టీ నేతలు వివిధ మతాల ప్రతినిధులతో కలిసి శ్మశానవాటికను సందర్శించారు. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చొరవతో శ్మశానవాటిక అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయని కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ నేతలు జొండ్ల ప్రభాకర్‌రెడ్డి, నేమూరి మహేష్‌గౌడ్, బొడిగె రాజుగౌడ్, దప్పు గిరిబాబు, ఎంకిరాల నర్సింహ్మా, కాసుల ఆనంద్ రాజ్, కడియాల బాబు, కొమ్ము రమేష్, నరసింహ, బాలరాజు, ఫయాజ్, రెడ్డినాయక్, బివి. పాల్, శ్యాముల్ తదితరులున్నారు.

బస్‌స్టాప్‌ను సర్వే స్థలంలోకి మార్చాలి

ఉప్పల్: ఉప్పల్ వరంగల్ బస్‌స్టాప్ వల్ల జిల్లా, సిటీ బస్సుల రద్దీ కారణంగా నిత్యం ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని, సీపీఐ నేతలు ఉప్పల్ ట్రాఫిక్ జోన్–1 డీసీపీ మల్లారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వీఎస్.బోస్, ఉప్పల్ నియోజకవర్గ కార్యదర్శి దామోదర్‌రెడ్డిలు మాట్లాడుతూ.. ప్రజా సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వాలు, అధికారులపై ఉందన్నారు. సర్వే ఆఫ్ ఇండియా సంస్థకు చెందిన ఖాళీ స్థలంలో ప్రజల సౌకర్యార్థం బస్‌షెల్టర్‌గా వినియోగిస్తే సమస్యకు పరిష్కారం లభిస్తుందని డీసీపీని కోరారు. ఉన్నతాధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు.

ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవం



మధుసూదన్‌రెడ్డి, సురేఖారెడ్డి దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

మల్లాపూర్: ప్రపంచ ఆటిజం దినోత్సవం సందర్భంగా నాచారం సాధన మానసిక దివ్యాంగుల సంస్థలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మేధో సమస్యలతో బాధపడే పిల్లల అభివృద్ధి, సహాయం చేయడానికి తాను ఎప్పుడూ సిద్ధంగా ఉంటానన్నారు. ఆటిజంపై అవగాహన కల్పించడంతో పాటు 'ఇంటలెక్చువల్లీ ఛాలెంజ్డ్' పిల్లలకు మద్దతు ఇవ్వడంలో సాధన మానసిక దివ్యాంగుల సంస్థ చేస్తున్న కృషిని అభినందించారు. కార్పొరేటర్లు శాంతిసాయిజెన్‌శేఖర్, పన్నాల దేవేందర్‌రెడ్డి, ఇండియన్, ఇండియన్ బిజినెస్ కౌన్సిల్ యూఎస్ఏ వ్యవస్థాపక అధ్యక్షులు చింతల రాజు, బండారు ప్రవీణ్, అగ్రికల్చర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ రవీందర్‌రెడ్డి, సాధన దివ్యాంగుల సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి, సురేఖారెడ్డి, బన్నాల ప్రవీణ్, గంధం నాగేశ్వర్‌రావు తదితరులున్నారు.

కాప్రా: ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవాన్ని బుధవారం కాప్రా ఎల్లారెడ్డిగూడలోని అనురాగ్ స్కూల్ ఘనంగా నిర్వహించారు. స్కూల్ వ్యవస్థాపకుడు డాక్టర్ రామ్ ఆధ్వర్యంలో ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ నికిల్, డాక్టర్ రాగిరాజన్ జ్యోతి ప్రజ్వలన చేసి ఆటిజం అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్ అనేది ఓ న్యూరో డెవలప్‌మెంటల్ రుగ్మత అన్నారు. ప్రతి 68 మంది పిల్లల్లో ఒకరు ఆటిజంతో బాధపడుతున్నారని, ఈ జన్యుపరమైన వ్యాధిని ముందుగానే గుర్తిస్తే సాధారణ స్థితికి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఈ లక్షణాలు స్కానింగ్ సహా ఏ ఇతర పరీక్షల్లో గుర్తించలేమన్నారు. ఇలాంటి లక్షణాలున్నాయని తెలిసినప్పుడు వారి తల్లిదండ్రులు అంగీకరించే అవకాశాలు తక్కువని, ఒక వేల గుర్తించి అంగీకరించే సమయానికి పిల్లాడి వయస్సు 7 నుంచి 9 ఏళ్లు దాటుతుందన్నారు. ఆ వయస్సులో ఏ థెరపీలో అయినా సరైన ఫలితం రావడం కష్టమవుతుందని, తన అనుభవంతో చెబుతున్నట్లు వివరించారు. ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.





అనురాగ్ స్కూల్‌లో..